క్లుప్తంగా

అగ్నిప్రమాదాలపై అవగాహన

కొత్తవలస: మండడల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై కొత్తవలస అగ్నిమాపకశాఖ అధికారి వై.అశోక్‌కుమార్ బుధవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలకు కారణాలు, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, మంటలు ఆర్పేందుకు అగ్నిమాపకశాఖ సిబ్బంది వినియోగించే వివిధ పరికరాలను పనితీరును వివరించారు. విద్యార్థులతో మాక్ డ్రిల్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కేజీబీవీ ఉపాధ్యాయులకు సత్కారం



కుమరాం కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న పౌరవేదిక ప్రతినిధులు

జామి: మండలంలోని కుమరాం కేజీబీవీలో చదివిన ఐదుగురు విద్యార్థినులు న్యూజివీడ్, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు లభించాయి. ఈ నేపథ్యంలో జిల్లా పౌరవేదిక ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించేలా కృషిచేసిన ఉపాధ్యాయులతో పాటు ప్రిన్సిపాల్ బలగం జ్యోతిని పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, సభ్యులు సత్కరించారు.

అర్హులకు పథకాలు అందకపోతే సంప్రదించండి

గంట్యాడ: అర్హత ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందనట్లయితే జిల్లా న్యాయ సేవాధికారి సంస్థకు నేరుగా గానీ, ట్రోల్ ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి విజయకళ్యాణి అన్నారు. మండలంలోని దిగువ కొండపర్తి, అడ్డతీగ, ముసలికండి గ్రామాల్లో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. ప్రజలకు సేవలందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

శృంగవరపుకోట: స్థానిక ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఉన్న బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న పి.మౌనిక, భరణికానహారిక రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చీఫ్ కోచ్ పి.శ్రీరాములు తెలిపారు. జూలై 18 నుంచి 21 వరకు జరిగిన జిల్లాస్థాయి బ్యా డ్మింటన్ పోటీల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 16 నుంచి 19 వరకు విజయనగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో జరిగే పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాధాన్యం వహించనున్నారు. క్రీడాకారులను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ రఘురాజు బుధవారం అభినందించారు.

తాటిపూడి ఎంపీటీసీ మృతి

గంట్యాడ: తాటిపూడి ఎంపీటీసీ గొర్లె చిన్నమ్మ(55) మృతిచెందారు. పెదమధుపాడ గ్రామానికి చెందిన చిన్నమ్మ ఈనెల 12న స్పృహతప్పి కింద పడిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు ఆమెకు వైద్య పరీక్షలు, స్కానింగ్ చేసి బ్రెయిన్ హేమరేజ్ అయినట్టు నిర్ధారించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో ఆమెను ఇంటికి తీసుకుని వెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతి పట్ల పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఏటీఎం విధానంలో రైతులకు నిరంతర ఆదాయం

బొండపల్లి: ఏటీఎం(ఎనీ టైం మనీ మోడల్) విధానంలో కాయగూరలను సాగు చేయడం ద్వారా రైతులు నిరంతర ఆదాయం పొందవచ్చని రీజనల్ ప్రకృతి వ్యవసాయాధికారి కె.హేమసుందర్ సూచించారు. మండలంలోని కోవ్వాడపేట గ్రామంలో ఏటీఎం విధానంలో సాగు చేస్తున్న కాయగూరల క్షేత్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగుచేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఏటీఎం మోడల్‌లో వివిధ రకాల కూరగాయ పంటలను ఏక కాలంలో సాగు చేసుకోవచ్చని, తద్వారా రైతులకు ఏడాది పొడవునా ఆదాయం సమకూరుతుందన్నారు.

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లిలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ విరోతి కొండలరావు, ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి స్వామినాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు వివిధ రకాల ఆకులతో కషాయాలను ఏ విధంగా తయారు చేసుకోవాలో వివరించారు. కషాయాల వినియోగంతో పంటలను ఆశించే చీడపీడలను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలో రైతులకు అవసరమైన నవధాన్యాల విత్తనాలు, కషాయాలు, కూరగాయల విత్తనాలు, లింగాకర్షక బుట్టలు, వంటివి అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలకపాత్ర

- పంచాయతీరాజ్ సహాయ కమిషనర్ కృష్ణమోహన్



కొత్తవలస: మాట్లాడుతున్న పంచాయతీరాజ్ సహాయ కమిషనర్ కృష్ణమోహన్

కొత్తవలస/లక్కవరపుకోట: పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లు, కార్యదర్శులదే కీలకపాత్ర అని పంచాయతీరాజ్ సహాయ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. కొత్తవలస ఎంపీడీఓ కార్యాలయంలో మూడు రోజులుగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. చివరిరోజు శిక్షణ తరగతులను పరిశీలించిన ఆయన పంచాయతీల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. లక్కవరపుకోట ఎంపీడీఓ కార్యలయంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వీధి దీపాల నిర్వహణ, పంచాయతీరాజ్ చట్టం, విద్యుత్ బిల్లులు చెల్లింపులు, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్.కోట ఎంపీడీఓ కె.రూపేష్, ఈఓపీఆర్డీలు ధర్మారావు, జ్ఞానేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- **దత్తిరాజేరు:** గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకపాత్ర వహించాలని స్వచ్ఛ భారత్ కోర్డినేటర్ గోవింద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు కృషిచేయాలని, ప్రతి ఇంటి వద్ద మరుగుదొడ్డి నిర్మించుకునేలా గ్రామస్తులను చైతన్యం చేయాలని సూచించారు.
- **బొండపల్లి:** గ్రామాల్లోని మౌలిక వనరులను సద్వినియోగం చేసుకొని పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా సర్పంచ్‌లు బాధ్యత తీసుకోవాలని ఈఓపీఆర్డీ కె.సుగుణాకరరావు అన్నారు. స్థానిక వనరులను పంచాయతీ అభివృద్ధికి ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.
- **జామి:** పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని పంచాయతీ రాజ్ సహాయ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణను బుధవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. విధులు, నిధుల పట్ల సర్పంచ్‌లు, కార్యదర్శులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నర్సింహులు, ఈఓపీఆర్డీ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.
- **వేపాడ:** పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడురోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. పంచయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, వీధిదీపాలు, చెత్త సంపద కేంద్రాల నిర్వహణ, అభివృద్ధి పనుల ప్రణాళికల రూపకల్పనపై రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇచ్చారు.

సహారా బాధితులకు న్యాయం చేయాలి



ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న సహారా బాధితులు, ఏజెంట్లు, సీఐటీయూ నాయకులు

శృంగవరపుకోట: సహారా బాధితులకు న్యాయం చేయాలని, బాధితులకు డిపాజిట్లు తక్షణమే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సహారా ఏజెంట్లు, బాధితులు మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక దేవీ జంక్షన్ వద్ద రస్తారోకో చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు, సహారా ఏజెంట్ల సంఘం నాయకుడు ఎం.సూరిబాబు, షేక్ అమానుల్లా ఖాన్, తదితరులు మాట్లాడుతూ.. పేదల సొమ్మును దోచుకున్న సహారా కంపెనీకి కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తోందని ఆరోపించారు. బాధితులకు డిపాజిట్లు తిరిగి చెల్లించాలని సుప్రీం కోర్టు ఆదేశించినా ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. సహారా పోర్టల్‌లో బాండ్ల వివరాలు నమోదు చేసుకున్న బాధితులకు తక్షణమే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మద్దిల రమణ, సీహెచ్ ముత్యాలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కొత్తవలస: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వై.పద్మజ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ఎస్.రమణయ్యకు శ్రీకాకుళం జిల్లా గార మండలానికి బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం ఎంపీడీఓగా పనిచేసిన పద్మజ బదిలీపై వచ్చారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆమె ఇదే స్థానంలో పనిచేశారు. ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ఆమెకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

- **దత్తిరాజేరు:** మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా సుబ్రహ్మణ్యం బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా వీరఘట్టం మండలానికి బదిలీపై వెళ్లారు. ఎన్నికలకు ముందు ఎక్కడ విధులు నిర్వహించారో ఆదే స్థానాలకు ప్రభుత్వం బదిలీ చేయడంతో మరోసారి మండల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు.
- **మెరకముడిదాం:** మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం.రత్నం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇక్కడ నుంచి శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలానికి బదిలీపై వెళ్లారు. ఎన్నికలు పూర్తవడంతో తిరిగి మండలానికి బదిలీపై వచ్చారు.
- **బొండపల్లి:** ఎంపీడీఓగా వై.వి.రాజేంద్రప్రసాద్ బుధవారం విధుల్లో చేరారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లిన ఆయన తిరిగి మండలానికి వచ్చారు.

‘లక్‌పతి దీదీ సమ్మేళన్’లో ఎస్.కోట మహిళ



ఢిల్లీలో నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడుతున్న భవాని

శృంగవరపుకోట: స్వయం సహాయక సంఘాల్లో చేరి స్వతంత్ర్యంగా ఎదిగిన మహిళలతో దేశరాజధాని ఢిల్లీలోని సి.సుబ్రహ్మణియన్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన ‘లక్‌పతి దీదీ సమ్మేళన్’ కార్యక్రమానికి ఎస్.కోట పట్టణానికి చెందిన చింతాడ భవాని పాల్గొని తాను ఏ విధంగా స్వయం సమృద్ధి సాధించిందో వివరించారు. 1999లో కొత్తమతల్లి మహిళా పొదుపు సంఘంలో చేరి పొదుపు చేయడం ప్రారంభించినట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి తీసుకున్న రుణంతో పాడిపశువులు కొనుగోలు చేసి జీవనోపాధి పొందినట్లు చెప్పారు. వచ్చిన డబ్బులతో పిల్లల చదువుతో పాటు కొత్త ఇంటిని నిర్మించుకున్నట్లు వివరించారు. ఆమె సాధించిన విజయాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలో ఏర్పాటు చేసిన ‘దీదీ సమ్మేళన్’కు ఆహ్వానించారు. పంద్రాగష్టు వేడుకల్లో భవాని ప్రభుత్వం నుంచి పురస్కారం అందుకోనున్నారు.

కేజీబీవీల్లో వసతుల పరిశీలన



చీపురుపల్లి: కేజీబీవీలో విద్యార్థులకు వండిన భోజనాలను పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత



చీపురుపల్లి రూరల్: గరివిడి కేజీబీవీలో వండిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న సివిల్ జడ్జి వై.ప్రేమలత



కొత్తవలస: అడ్డూరువానిపాలెం కేజీబీవీలో ప్రిన్సిపాల్ నుంచి వివరాలు సేకరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయచంద్ర



వేపాడ: బుక్కునాయుడుపేట కేజీబీవీలో సౌకర్యాలను పరిశీలిస్తున్న జడ్జి విజయ్‌చంద్ర

గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని కేజీబీవీలు, జూనియర్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న వసతులను స్థానిక కోర్టుల న్యాయమూర్తులు బుధవారం పరిశీలించారు. వంటగది, వసతిగదుల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

– చీపురుపల్లి/చీపురుపల్లి రూరల్/వేపాడ/కొత్తవలస

ఉప్పొంగిన దేశభక్తి



చీపురుపల్లి: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు



చీపురుపల్లి: 500 అడుగులు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ యువమోర్చ నాయకులు, విద్యార్థులు



బొండపల్లి: ‘హర్ ఘర్ తిరంగా’ ర్యాలీలో పాల్గొన్న వెలుగు ఉద్యోగులు, సిబ్బంది



జామి: జామిలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



మెరకముడిదాం: బైరీపురంలో జాతీయ పతాకాలతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ‘హర్ ఘర్ తిరంగా’ ర్యాలీలు నిర్వహించారు. వెలుగు ఉద్యోగులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు జాతీయ జెండాలను పట్టుకుని ర్యాలీలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. చీపురుపల్లిలో బీజేపీ యువమోర్చ ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ కోకన్వీనర్ మన్నెపురి శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు 500 అడుగుల పొడవైన జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని గాంధీబొమ్మ జంక్షన్ నుంచి మూడు రోడ్ల జంక్షన్, మెయిన్‌రోడ్డు, తదితర ప్రాంతాల్లో ర్యాలీ కొనసాగింది.

– చీపురుపల్లి/బొండపల్లి/జామి/మెరకముడిదాం